www.prajasakti.com

ప్రజాశక్తి

మంగళవారం 28 అక్టోబర్ 2025 5 తూర్పుగోదావరి



విద్యుత్ అంతరాయం లేకుండాచూడాలి

ప్రజాశక్తి – రాజానగరం



తుపాను నేపథ్యంలో ముందస్తు చర్యలు చేపట్టి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలని విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ కీర్తి చేకూరి ఆదేశించారు. రాజానగరం విద్యుత్ సబ్ స్టేషన్‌ను ఆమె సోమవారం రాత్రి సందర్శించారు. క్షేత్ర స్థాయిలో చేపడుతున్న పనులను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్ల సామర్థ్యం వివరాలు, ఈదురుగాలులు, వర్షం వస్తే తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేశారు. ఆమె వెంట ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ కె.తిలక్‌కుమార్, ఎఇ వివిఎస్.సుధాకర్ ఉన్నారు.

హడలెత్తిస్తున్న మొంథా

- జిల్లా వ్యాప్తంగా వర్షాలు
- నేడు మరింత తీవ్ర తరం
- అధికారులు అప్రమత్తం

ప్రజాశక్తి– రాజమహేంద్రవరం ప్రతినిధి

మొంథా ముప్పు ముంచుకొస్తోంది. వాతావరణ శాఖ హెచ్చరికలతో అందరిలోనూ ఆందోళన నెలకొంది. తుపాను ప్రభావంతో సోమవారం ఉదయం నుంచే ఎడతెరిపిలేని వర్షం కురుస్తుంది. కాకినాడకు 500 కిలోమీటర్ల దూరంలో తుపాను కేంద్రీకృతమై ఉంది. మంగళవారం రాత్రికి ఇది కాకినాడ, తుని మధ్య తీరం దాటే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. దీంతో కాకినాడ జిల్లాలో రెడ్ అలర్ట్ ప్రకటించారు. ఈ ప్రభావం తూర్పు గోదావరిపైనా అధికంగానే ఉండే అవకాశం ఉంది. ఈ నెల 29 వరకూ విద్యాసంస్థలకు సెలవులు ప్రకటించారు. ప్రభుత్వ అధికారులు, సిబ్బందికి సెలవులను రద్దు చేశారు.

జిల్లాలో 12 మండలాల్లో తొలి రోజు తుపాను ప్రభావం నెలకొంది. రాజానగరం, పెరవలి, నల్లజర్ల, రంగంపేట మండలాల్లో పంటలపై వర్షం తీవ్ర ప్రభావం చూపించింది. పలుచోట్ల పంట మునిగింది. మరికొన్ని చోట్ల వరిపంట నేలకొరిగింది. తుపాను నేపథ్యంలో ఎంపిడిఒల పర్యవేక్షణలో మండల స్థాయి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. ఇవి ఈ నెల 30 వరకు 24 గంటలూ పనిచేయనున్నాయి. అవసరమైతే తప్ప ప్రయాణాలు చేయొద్దని, బయటకు రావొద్దని ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. వ్యవసాయ అధికారులు, పశు వైద్యులు రైతులను అప్రమత్తం చేస్తున్నారు.

ప్రత్యేక అధికారి సమీక్షా సమావేశం

తుఫాన్ నేపథ్యంలో జిల్లా ప్రత్యేక అధికారి, ఎస్‌డిఆర్‌ఎఫ్ కమిషనర్ కన్నబాబు క్షేత్రస్థాయిలో పర్యటించారు. నిడదవోలు మున్సిపల్ కార్యాలయంలో అధికారులతోసమావేశం అయ్యారు. వర్షాలు, గాలుల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, ప్రజలకు కలిగే నష్టాలపై ఆయన సమీక్షించి.. సహాయక చర్యల పర్యవేక్షణతోపాటు తగు సూచనలు, సలహాలు అందించారు. కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే జిల్లా కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. రానున్న రెండు రోజుల పాటు జిల్లా అధికారులు, తహశీల్దార్లు, విఆర్‌ఒలు, ఇతర సిబ్బంది ప్రధాన కేంద్రాల్లో ఉండాలని స్పష్టం చేశారు. ఈ నెల 27 నుంచి 29 వరకు జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలలకు, కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలకు సెలవు ప్రకటించారు.



కాకినాడ తీరంలో ఎగసి పడుతున్న కెరటాలు



ముద్దూరు లంకలో పునరావాస కేంద్రం

కంట్రోల్ రూమ్‌ల నెంబర్లు

కలెక్టరేట్ కంట్రోల్ రూమ్	0883–2944455
రాజమండ్రి ఆర్‌డిఒ ఆఫీస్	0883–2442344
రాజమహేంద్రవరంఅర్బన్	0883–2940695
రాజమహేంద్రవరం రూరల్	9849903860
కడియం	6301523482
రాజానగరం	9494546001
రంగంపేట	9393931667
కోరుకొండ	9154474851
అనపర్తి	9441386920
బిక్కవోలు	9849903913
సీతానగరం	9177096888
గోకవరం	9491385060
కొవ్వూరు ఆర్‌డిఒ ఆఫీస్	7995367797
కొవ్వూరు	9866778416
చాగల్లు	9441293856,
తాళ్ళపూడి	7993636666
పెరవలి	08819–232179
ఉండ్రాజవరం	9491041474
నల్లజర్ల	9491041451
దేవరపల్లి	9705818045
గోపాలపురం	7569856778
నిడదవోలు	9440580856

జిల్లాలో 151.6 మిల్లీమీటర్ల వర్షపాతం

జిల్లా వ్యాప్తంగా 151.6 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. మొంథా తుపాను నేపథ్యంలో జిల్లా వ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. జిల్లాలోని అన్ని మండలాల్లో సగటు వర్షపాతం 8 మిల్లీమీటర్లుగా నమోదయింది. రాజానగరం మండలంలో అత్యధికంగా 15.8 మిల్లీమీటర్లు నమోదు కాగా బిక్కవోలు మండలంలో 14.4, పెరవలి మండలంలో 13.8, అనపర్తి మండలంలో 13.2 మిల్లీమీటర్ల చొప్పున నమోదైంది. అత్యల్పంగా దేవరపల్లి, తాళ్లపూడి మండలాల్లో 2.2 మి.మీ చొప్పున వర్షపాతం నమోదైంది.

43 రైళ్లు రద్దు

రాజమహేంద్రవరం సిటీ : తూర్పు కోస్తా రైల్వే 43 రైళ్లను రద్దు చేసింది. ఎటువంటి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికుల భద్రత దృష్ట్యా రెండు రోజుల పాటు ఈ నిర్ణయం తీసుకున్నట్లు సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులు ప్రకటించారు. విశాఖపట్నం మీదుగా నడిచే పలు ఎక్స్‌ప్రెస్, ప్యాసింజర్, మెమూ, వీక్లీ రైళ్లను రద్దు చేసినట్లు రైల్వే విభాగం అధికారులు ప్రకటించారు. రద్దు చేసిన రైళ్లలో విశాఖ– కెఆర్‌డిఎల్, విఎస్‌కెపి– డబల్ డెక్కర్ రైళ్లు, విఎస్‌కెపి–జిఎస్‌టి, విఎస్‌కెపి–ఎంటిఎం, విఎస్‌కెపి–హెచ్‌వైబి, విఎస్‌కెపి–హెచ్‌వైబి, విఎస్‌కెపి –ఎస్‌డిఎల్‌ఎస్, విఎస్‌కెపి –ఎస్‌సి, విస్‌కెపి –ఎల్‌టిటి ఎక్స్ ప్రెస్ రైళ్లు ఉన్నాయి. మరి కొన్ని రైళ్లను ఈ నెల 29తో పాటు 30న రద్దు చేసినట్లు రైల్వే అధికారులు తెలిపారు.



అన్నదాతల్లో కలవరం

- 8,922 ఎకరాల్లో నేల వాలిన వరి
- 960 ఎకరాల్లో పంట నీట మునక
- రైతుల వద్దే 5,500 క్వింటాళ్లు ధాన్యం

ప్రజాశక్తి – కొవ్వూరు

మొంథా తుపాను రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తుంది. ఆరుకాలం చెమటోర్చి పండించిన పంట చేతికి దక్కే సమయంలో కురుస్తున్న భారీ వర్షాలు, ఈదురు గాలులతో అన్నదాతలు భయాందోళన చెందుతున్నారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 8,922.5 ఎకరాల్లో పంటకు పాక్షిక నష్టం వాటిల్లినట్లు అధికారులు గుర్తించారు. ఈదురుగాలుల ప్రభావానికి 12 మండలాల పరిధిలో 108 గ్రామాల్లో 5,207 మంది రైతులకు చెందిన వరి పంట నేలకొరిగింది. మరో 960.5 ఎకరాల్లో పంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించారు. జిల్లా వ్యాప్తంగా ఆదివారం సాయంత్రం కంటే నష్ట తీవ్రత రెట్టింపు కావడం రైతుల్ని ఆందోళనకు గురిచేస్తుంది. జిల్లాలో 1.32 లక్షల ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. సోమవారం సాయంత్రానికి 4,739 ఎకరాల్లో కోతలు పూర్తయినట్లు అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఎకరాకు మూడు మెట్రిక్ టన్నులు చొప్పున 5686 మెట్రిక్ టన్నుల ధాన్యం రైతుల వద్ద నిల్వ ఉన్నట్లు అంచనా. జిల్లాలో మరో 12,250 ఎకరాల్లో పంట మసూళ్లకు సిద్ధంగా ఉందని అధికారులు చెబుతున్నారు. ఈదురు గాలుల ప్రభావానికి కొత్త దశలో ఉన్న ఈ పంట పొలాలు నేల వాలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయంటునా్ౖరు.పలుచోట్ల పాలు పోసుకునే, గింజ గట్టి పడే దశలో ఉన్న పంట పొలాల సైతం నేలవాలయి. దీంతో దిగుబడిపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మొక్కుబడిగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు:

జిల్లాలో ఇప్పటి వరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు నిడదవోలు మండలం డి.ముప్పవరం లోను, సోమవారం చాగల్లు మండలం చంద్రవరం, కొవ్వూరు మండలం పసివాదుల గ్రామాల్లోనూ ప్రారంభించారు. 221 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తామని అధికారులు చెప్పినప్పటికీ క్షేత్రస్థాయిలో నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీంతో రైతులు దళారులకు, మిల్లర్లకు తక్కువ ధరకు పంట అమ్ముకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోగా అధికారులు మాత్రం ప్రస్తుతం మసూళ్లు పూర్తి చేసుకున్న రకాలు బహిరంగ మార్కెట్ లోనే విక్రయాలు చేస్తారని చెబుతున్నారు. ఆర్‌పిబియో 226 రకం 2,375 ఎకరాల్లో, బిపిటి 5204 రకం 768.75 ఎకరాలు, ఎంటియు 1156 వంగడం 45 ఎకరాలు, కెఎన్‌ఎం 733 రకం 70 ఎకరాలు, ఎంటియు 3626 రకం 30.35 ఎకరాలు, పిఆర్ 226 వెరైటీ 1,192 ఎకరాలు, ఎంటియు 7024 రకం 127 ఎకరాలు, ఎంటియు 1010 రకం 49.5 ఎకరాల్లో కోతలు పూర్తి చేసినట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. కొవ్వూరు, చాగల్లు, కాతేరు, ఉండ్రాజవరం తదితరులు ప్రాంతాల్లో రైతులు బహిరంగ మార్కెట్లో విక్రయిస్తున్నారు.

విద్యుత్ అధికారులు ముందస్తు చర్యలు

తుఫాన్ నేపథ్యంలో మండలానికి 50 మంది చొప్పున అదనపు సిబ్బందిని నియమించినట్లు ఎపి ఇపిడిసిఎల్ ఎస్‌ఇ తిలక్‌కుమార్ తెలిపారు. ముందస్తు చర్యల్లో విద్యుత్తు లైనులకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను సోమవారం తొలగించినట్లు నిడదవోలు ఇఇ నారాయణ అప్పారావు తెలిపారు. ఉండ్రాజవరం, కొవ్వూరు, నిడదవోలు పెరవలి తదితర మండలాల్లో చెట్ల కొమ్మలను తొలగించామన్నారు..

మంత్రి దుర్గేష్ ముంబాయి పర్యటన రద్దు

ప్రజాశక్తి–రాజమహేంద్రవరం సిటీ

తుపాను నేపథ్యంలో మంత్రి కందుల దుర్గేష్ ముంబయి పర్యటనను రద్దు చేసుకున్నారు. ముంబాయిలో ఐదు రోజుల పాటు జరగనున్న గోరేగావ్‌లో ఇండియా మెరిటైమ్ వీక్ –2025 బాంబే ఎగ్జిబిషన్‌లో ఆయన పాల్గొనాల్సి ఉంది. పర్యటనలో భాగంగా ఆయన ఇప్పటికే హైదరాబాద్ వెళ్లారు. తుపాను నేపథ్యంలో తిరిగి రాజమహేంద్రవరం చేరుకున్నారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ప్రజలకు అందుబాటులో ఉండేందుకు రాజమహేంద్రవరం వచ్చారు.

407 ఎకరాల్లో నేల కొరిగిన వరి

ప్రజాశక్తి–కడియం

వర్షాలకు మండలంలో 407.50 ఎకరాల్లో వరి పంట నేలకొరిగిందని ప్రాథమికంగా గుర్తించామని ఎఒ పివి.శ్రీనివాస్ తెలిపారు. నేలకొరిగిన వరి పొలాలను ఆయన సోమవారం పరిశీలించారు. మండలంలో మొత్తంగా 5,035 ఎకరాల్లో వరిని సాగు చేస్తున్నామన్నారు. రైతులకు క్షేత్ర స్థాయి సిబ్బంది అందుబాటులో ఉన్నారన్నారు. ఎప్పటికప్పుడు వరి పంటకు సంబంధించి రైతులకు సూచనలు అందజేస్తున్నామన్నారు.

23 పునరావాస కేంద్రాలు

ప్రజాశక్తి – పెరవలి

పెరవలి మండలంలో 23 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తహశీల్దార్ కె.నిరంజన్ తెలిపారు. పెరవలి, కానూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది, పంచాయతీ మిడ్డే మీల్స్ సిబ్బంది 24 గంటలూ పునరావాస కేంద్రంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

అధికార యంత్రాంగం అప్రమత్తం : కలెక్టర్

ప్రజాశక్తి –రాజమహేంద్రవరం ప్రతినిధి

తుపాను నేపథ్యంలో జిల్లాలో అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉందని కలెక్టర్ కీర్తి చేకూరి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో క్షేత్ర స్థాయి అధికారులతో ఆమె సమీక్షించారు. జిల్లాలో సగటు వర్షపాతం 8 మిల్లీమీటర్లుగా నమోదయిందని, ఇప్పటి వరకు 105 గ్రామాల్లో 762.27 ఎకరాల్లో వ్యవసాయ భూములు ముంపునకు గురైనట్లు తెలిపారు. బిక్కవోలు, రంగంపేట మండలాల్లో నాలుగు ఇళ్లకు స్వల్ప నష్టం జరిగినట్లు పేర్కొన్నారు. విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థల్లో ఎటువంటి అంతరాయం లేదని అధికారులు ఆమెకు తెలిపారు.

కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ ప్రజల భద్రతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. అన్ని శాఖలు అప్రమత్తంగా ఉండి తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో 9 మండలాలు, 303 గ్రామాలు ప్రభావితమయ్యే అవకాశం ఉందని, 12 మండల కంట్రోల్ రూములు, 184 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఒక ఎన్‌డిఆర్‌ఎఫ్, ఒక ఎస్‌డిఆర్‌ఎఫ్ బృందాలు మొహరించాయన్నారు. తాగునీటి సరఫరా, ఆహార ప్యాకెట్ల పంపిణీకి తగిన ఏర్పాట్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, జిల్లా కంట్రోల్ రూమ్ 24 గంటలూ అందుబాటులో ఉంటుందన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, అత్యవసర పరిస్థితుల్లో 112, 1070 లేదా 1800 425 0101 నంబర్లను సంప్రదించాలన్నారు.



కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్

సాధారణ స్థాయిలోనే ఎర్రకాలువ ప్రవాహం

ప్రజాశక్తి – నిడదవోలు రూరల్

ఎర్రకాలువ ప్రవాహం సాధారణ స్థితిలోనే ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సినది లేదని సిఆర్‌డిఎ కమిషనర్ కె.కన్నబాబు తెలిపారు. ఆయన సోమవారం నిడదవోలులో పర్యటించారు. తుపాను నేపథ్యంలో అధికారులతో స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సమీక్షించారు. ఎర్రకాలువ ఉధృతంగా ప్రవహిస్తుందన్న వార్తల నేపథ్యంలో ప్రజల్లో ఆందోళన నెలకొందన్నారు. ప్రస్తుతం 2వేల క్యూసెక్కుల నీరు మాత్రమే ప్రవహిస్తోందన్నారు. ఇది ప్రమాదకర స్థాయి కాదని స్పష్టం చేశారు. వర్షాల వల్ల కొంత ప్రవాహం పెరిగే అవకాశం ఉందన్నారు. తుపాను సమయంలో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అన్ని శాఖాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. లోతట్టు ప్రాంతాల్లో తగిన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఏ సమస్య ఉన్నా వెంటనే స్థానిక అధికారులను సంప్రదించాలని ప్రజలకు సూచించారు. ఈ సమావేశంలో ఆర్‌డిఒ రాణి సుస్మిత, మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, మున్సిపల్ కమిషనర్ కృష్ణవేణి, తహశీల్దార్ నాగరాజు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

సహాయక చర్యలపై సమీక్ష

నిడదవోలు : తుపాను నేపథ్యంలో జిల్లా స్పెషల్ ఆఫీసర్ కె.కన్నబాబు ఆధ్వర్యంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పట్టణంలో చేపడుతున్న సహాయక చర్యలపై మున్సిపల్ కమిషనర్‌ను వివరాలు అడిగారు. టీచర్స్ కాలనీ, తీరుగూడెం, సుబ్బరాజుపేట, అన్నపూర్ణ నగర్, నెహ్రూ నగర్ ట్యాంక్ వెనక, ఇందిరా నగర్ ముంపు ప్రాంతాలుగా గుర్తించామన్నారు. వారికి నాలుగు పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ఎర్రకాలువను పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి

శైవ క్షేత్రాలు కిటకిట

ప్రజాశక్తి–కడియం

కార్తీక సోమవారం కావడంతో శైవాలయాలు యాత్రికులతో కిటకిటలాడాయి. వేకువ జాము నుంచే యాత్రికులు స్నానాలాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దీపపు ప్రమిదల్లో జ్యోతులు వెలిగించారు. కడియం, వీరవరం, మురమండ, జేగురుపాడు, వేమగిరి, ఎంఆర్.పాలెం శైవ క్షేత్రాలతో పాటు కడియపులంకలో పచ్చటి నర్సరీల మధ్య కొలువైన అనంతేశ్వరస్వామి ఆలయానికి యాత్రికులు పెద్ద సంఖ్యలో వచ్చారు. అనంతేశ్వరస్వామి ఆలయంలో 600 దంపతులకు ప్రత్యేక అభిషేకాలను నిర్వహించారు. ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

తుపానుపై మంత్రి దుర్గేష్ సమీక్ష

ప్రజాశక్తి – నిడదవోలు

స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో తుపాను సహాయక చర్యలపై అధికారులతో మంత్రి కందుల దుర్గేష్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ తుపానును సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రజలకు కావాల్సిన అవసరాలను సమయానికి అందించడానికి సిద్ధంగా ఉండాలని తెలిపారు. ఎటువంటి పరిస్థితులైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. అధికారులకు సహకరించాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఇప్పటికే పునరావాస కేంద్రాల ఏర్పాటు పూర్తయిందన్నారు. ప్రజలకు తాను కూడా అందుబాటులో ఉంటాన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా 24/7 మంత్రి కార్యాలయం, అధికారులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ సమావేశంలో తహశీల్దార్, ఎంపిడిఒ, పాల్గొన్నారు.

సమన్వయంతో సేవలందించాలి

ప్రజాశక్తి – ఉండ్రాజవరం

తుపాను నేపథ్యంలో నాయకులు, అధికారులు సమన్వయంతో సేవలను అందించాలని ఎపి నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ బూరుగుపల్లి శేషారావు అన్నారు. ఆయన అధ్యక్షతన సోమవారం నాయకులు, అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తుపాను నేపథ్యంలో ఎటువంటి విపత్కర పరిస్థితి తలెత్తినా వెంటనే అధికార యంత్రాంగంతో సమన్వయం చేసుకుని, సమస్యను పరిష్కరించాలన్నారు. తుపానును ఎదుర్కొనేందుకు మండలంఓ అన్ని ముందస్తు ఏర్పాట్లు చేశామన్నారు. అన్ని శాఖల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తారని తహశీల్దార్ పిఎన్‌డి.ప్రసాద్ తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా విద్యుత్ వైర్లపై పడే అవకాశం ఉన్న చెట్ల కొమ్మలను తొలగిస్తున్నామని ఎలక్ట్రికల్ ఎఇ రమేష్‌బాబు తెలిపారు. ప్రాథమిక అంచనా ప్రకారం ఎనిమిది గ్రామాల్లో 130 హెక్టార్ల వరి పంట నీట మునిగినట్లు వ్యవసాయ అధికారి బి.రాజారావు తెలిపారు. మండలంలోని ప్రతి గ్రామంలో ఒక్కొక్క పాఠశాలను తుఫాను పునరావాస కేంద్రాలుగా గుర్తించినట్లు డిటి కనకదుర్గ తెలిపారు. వైద్య సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉంటారని వైద్యాధికారి డాక్టర్ బి.దుర్గామహేశ్వర రావు తెలిపారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ఎంఎల్‌ఎ పర్యటన

ప్రజాశక్తి – కొవ్వూరు

కొవ్వూరు మండలం వాడపల్లి, బంగారంపేట, మద్దూరులంక, చిగురులంక, బ్రిడ్జిపేట గ్రామాల్లో లోతట్టు ప్రాంతాలను ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం పర్యటించారు. మద్దూరు హైస్కూల్లోనూ కొవ్వూరు పిఎంఎం హైస్కూల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను సందర్శించారు. ఎంపిపి కాకర్ల నారాయుడు, మాజీ మున్సిపల్ చైర్మన్ సూరపని చిన్ని, కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుపాను వల్ల ప్రాణ నష్టం జరగకుండా, అన్ని జాగ్రత్తలనూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటుందన్నారు. ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేయాలని అధికారులకు సూచించారు. తుపాను ప్రభావంతో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

సూర్యనారాయణరాజు ప్యానెల్‌కు సత్కారం

ప్రజాశక్తి – రాజమహేంద్రవరం రూరల్

సర్ ఆర్థర్ కాటన్ గోదావరి ఎంప్లాయీస్ హౌసింగ్ సొసైటీ ఎన్నికల్లో విజయం సాధించిన సాగి సూర్యనారాయణరాజు ప్యానెల్‌ను ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ జిల్లా అడహక్ కమిటీ చైర్మన్, సభ్యులు సోమవారం సత్కరించారు. సాగి వెంకట సూర్యనారాయణరాజుతో పాటూ ప్యానెల్‌లో 12 మంది డైరెక్టర్లను సత్కరించారు. ఎపి ఎన్‌జిఒ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎపిఎన్‌జిఒ జిల్లా అడహక్ కమిటీ చైర్మన్ మాధవరావు మాట్లాడారు. సొసైటీ స్థలాల సాధనలో హౌసింగ్ సొసైటీకి అండగా ఉంటామన్నారు. .

పాడి రైతులకు అవగాహన

చాగల్లు : మొంథా తుపాను దృష్ట్యా పశువులకు అత్యవసర చికిత్స కోసం టీకాలు, మందులు ఇప్పటికే అందుబాటులో ఉంచామని పశు వైద్యుడు డాక్టర్ యు.ముఖేష్ తెలిపారు. పశువులను ఎత్తైన, పొడిగా ఉన్న, సురక్షితమైన ప్రదేశాల్లో ఉంచాలన్నారు. చెట్ల కింద, గోడలు, విద్యుత్ స్తంభాల వద్ద కట్టరాదన్నారు. పశు గ్రాసం, నీరు ముందుగానే నిల్వ చేసుకోవాలన్నారరు. ముందు జాగ్రత్తలతో నష్టాలను అధిగమించొచ్చన్నారు. పశువులకు ఏవైనా అత్యవసర పరిస్థితులు ఎదురైనపుడు వెంటనే పశుసంవర్ధక అసిస్టెంట్ లేదా వైద్యునికి సమాచారం ఇవ్వాలన్నారు.



ఉద్యాన పంటలకు జాగ్రత్తలు అవసరం

జిల్లా ఉద్యాన అధికారి మల్లికార్జునరావు

ప్రజాశక్తి – కొవ్వూరు, పెరవలి, సీతానగరం

తుపాను నేపథ్యంలో ఉద్యాన రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా ఉద్యాన అధికారి ఎన్.మల్లికార్జునరావు సూచించారు. సోమవారం ఆయన దొమ్మేరు, కాపవరంలో పర్యటించారు. ఉద్యాన పంటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. అనంతరం నిడదవోలు, దేవరపల్లి, పెరవలి మండలాల్లో ఆయన పర్యటించారు. కొవ్వూరు, దేవరపల్లి ఎఒలు సుధీర్ కుమార్, జి.రమేష్‌లతో కలిసి ఆయన ఉద్యాన పంటలను సోమవారం పరిశీలించారు. పెరవలి, కొవ్వూరు, దేవరపల్లి, నిడదవోలు మండలాలలో పర్యటించారు. నీట మునిగిన అరటి తోటల్లో నీటిని త్వరగా బయటకు పంపించాలన్నారు. అరటి చెట్లు పడిపోకుండా మొక్కలకు కర్రలు కట్టాలన్నారు. తయారైన గెలలను వెంటనే మార్కెట్‌కు తరలించాలన్నారు. బొప్పాయి తోటల్లోనూ ఇవే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కుళ్లిన కాయలను వెంటనే తొలగించి మెటలాక్సిల్–ఎంజెడ్ లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్‌తో కలిపి సూక్ష్మపోషక మిశ్రమం పిచికారీ చేయాలన్నారు. కూరగాయల రైతులూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మొక్కల వేర్ల చుట్టూ మట్టి ఎత్తి వేసి వేర్లు కుళ్లకుండా రక్షించుకోవాలన్నారు. వర్షాల తర్వాత పంటల్లో ఫంగస్ వ్యాధులు విస్తరిస్తాయన్నారు. వీటి నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా మెటాలాక్సిల్ ఫంగిసైడ్‌లను పంటపై స్ప్రే చేయాలన్నారు. వారి వెంట గ్రామ సహాయకులు, రైతులు ఉన్నారు

కోరుకొండ ఉద్యాన శాఖ అధికారి సీతానగరం మండలంలో పర్యటించారు. మండలంలో 2,227 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. ముఖ్యంగా అరటి, కూరగాయలు సుమారు 700 ఎకరాల్లో సాగులో ఉన్నాయన్నారు. ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నందున, అరటి, బొప్పాయి, కూరగాయలు, పూల వంటి పంటల రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.



అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి – చాగల్లు

మండలంలోని చంద్రవరం గ్రామంలో సోమవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. మండలంలో 24 వేల మెట్రిక్ టన్నులు ధాన్యం కొనుగోలు చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రవరం సర్పంచ్ మద్దిపాటి శ్రీరామ్‌మూర్తి, ఎంపిటిసి సభ్యులు గారపాటి నరసింహమూర్తి, మార్కొండపాడు సొసైటీ ప్రెసిడెంట్ మద్దిపాటి వీరరాఘవ, జిల్లా వ్యవసాయ అధికారి మాధవరావు, ఎడిఎ చింతల శ్రీనివాస్, ఎఒ కె.వేణుగోపాలకష్ణ, సొసైటీ సెక్రటరీ వరలక్ష్మి సిబ్బంది పాల్గొన్నారు.

కొవ్వూరు : పసివేదల గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రం నూతన భవనాన్ని ఎంఎల్‌ఎ ముప్పిడి వెంకటేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. అనంతరం కేంద్రంలో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను ఆయన ప్రారంభించారు. సొసైటీ అధ్యక్షుడు గారపాటి రామచంద్రరావు, ఆళ్ల హరిబాబు, కూటమి నాయకులు, డిస్ట్రిక్ట్ అగ్రికల్చర్ ఆఫీసర్ సిస్తు మాధవరావు, వ్యవసాయ శాఖ ఎడి చింతల శ్రీనివాసరావు, ఎఒ ఎ.గంగాధర్ పాల్గొన్నారు.

అప్రమత్తంగా ఉండాలి

దేవరపల్లి : తుపాను నేపథ్యంలో ప్రజలంగా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మండలంలో 15 ప్రభుత్వ పాఠశాలల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామని, వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.కమ్యూనికేషన్ రంగానికి ఇబ్బంది కలగకుండా చెట్లను తొలగించడానికి అవసరమైన యంత్రాలను ఏర్పాటు చేశామన్నారు.

నేరాలు ఘోరాలు

గుర్తు తెలిని మృతదేహం స్వాధీనం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం సిటీ

రాజమహేంద్రవరం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ప్రభుత్వ హాస్పటల్ ఆవరణలోని పోలీసు కంట్రోల్ రూమ్ వద్ద నూతనంగా నిర్మిస్తోన్న భవనంలో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం పడి ఉంది. కనీసం గుర్తించలేని విధంగా పురుగులు పట్టి, కుళ్లిపోయి ఉంది. ఇది హత్యా, ఆత్మహత్యా అనేది తెలియాల్సి ఉంది. హాస్పటల్ సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు త్రీ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోపిడీ కేసులో ముగ్గురు అరెస్ట్

ప్రజాశక్తి - గోకవరం

మారణాయుధాలు చూపించి దారి దోపిడీలకు పాల్పడుతున్న ముగ్గురు గోకవరం పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ఈ నెల 6వ తేదీ రాత్రి కొత్తపల్లి రహదారిలోని జిమ్ సెంటర్ వద్ద దుర్గాప్రసాద్ అనే వ్యక్తి రోడ్డు పక్కన ఆగి టాయిలెట్‌కి వెళ్తున్నారు. ఈ సమయంలో అతని వద్దకు చిరునామా పేరుతో వెళ్లి చాకు చూపించి చంపేస్తామంటూ బెదిరించి సెల్ ఫోను, రూ.2 వేలు నగదు, స్కూటీ లాక్కొని పారి పోరన్నారన్నారు. దీంతో వారిపై నిఘా పెట్టామన్నారు. గోకవరం గ్రామానికి చెందిన నల్లంశెట్టి రాజేష్, లింగంపల్లి శివమోహన్, తుమ్మల అరవిందలను అరెస్టు చేశామన్నారు. వీరు గ్రామ శివారులో మారణ యుధాలు చూపించి దారి దోపిడీకి పాల్పడుతున్నారు. రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచామని ఎస్ఐ పవన్ కుమార్ తెలిపారు.

కాపవరంలో హైవేపై లారీ బోల్తా

ప్రజాశక్తి-కొవ్వూరు

కాపవరం జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం లారీ అదుపుతప్పి బోల్తా పడింది. దేవరపల్లి నుంచి కొవ్వూరు వైపు వస్తున్న బియ్యం లోడు లారీ ఆకస్మికంగా బ్రేక్ వేయడంతో అదుపు తప్పి బోల్తా పడింది. దీంతో కొద్దిసేపు ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతన్ని 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు రూరల్ ఎస్ఐ కె.శ్రీహరిరావు తెలిపారు. లారీ డ్రైవర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

దాడి చేశారని మహిళ ఫిర్యాదు

ప్రజాశక్తి - సీతానగరం

తమపై దాడి చేశారంటూ ఇనుగంటివారి పేటకు చెందిన ఇనుమర్తి జ్యోతి సోమవారం సీతానగరం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ నెల 24న ఇనుగంటివారిపేటలో తన సోదరుడు వేమగిరి సూరిబాబు, సోదరి రజనీలను ఆదే గ్రామానికి చెందిన వీధి స్వామి, తాతి కుమారులు నాని, అరుణ్, తమ్మిరిసి బాలు దౌర్జన్యంగా కొట్టారని జ్యోతి తెలిపింది. ఎస్సీ కమ్యూనిటీ హాల్ వద్దకు ఈడ్చుకెళ్లి రక్తపు గాయాలయ్యేలా కొట్టారన్నారు. తన సోదరుని కేకలు విని కాపాడ్డానికి వెళ్లగాని పేర్కొంది. దీంతో వారు తనపై బూతులు తిడుతూ దాడికి దిగారని తెలిపింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రామ్‌కుమార్ తెలిపారు.

గుల్లిపాడులో వ్యక్తి మృతి

ప్రజాశక్తి-కోరుకొండ

తుని రైల్వే స్టేషన్ పరిధిలో గుల్లిపాడు స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని ట్రాన్స్‌జెండర్ మరణించినట్లు తుని రైల్వే ఎస్ఐ జి.శ్రీనివాసరావు తెలిపారు. మరణించిన వ్యక్తికి 30 ఏళ్ల వయసు ఉంటుందని, తెలిపారు. కుడి చేతిపై అమ్మ అని ఇంగ్లీషులో పచ్చబొట్టు ఉందన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

ప్రజాశక్తి - తాళ్లరేవు

మండలంలోని ఉప్పంగలలో దుండగులు మహిళ మెడలో గొలుసు అపహరించిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. కార్తీక సోమవారం కావడంతో శివాలయానికి వెళుతున్న గ్రామానికి చెందిన కట్టా రామలక్ష్మి మెడలో బంగారు గొలుసును బైకుపై వచ్చిన ఇద్దరు ఆగంతకులు లాక్కుని పరారయ్యారు. దీనిపై ఆమె కోరంగి పోలీసులకు ఫిర్యాదు చేశారు.

పేకాట శిబిరంపై పోలీసుల దాడి

ప్రజాశక్తి - రావులపాలెం

వెదిరేశ్వరంలో ఒక గృహంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో 10 మందిని అరెస్టు చేసినట్లు సిఐ శేఖర్‌బాబు తెలిపారు. అలాగే స్థానిక బండివీధుపుంత పబ్లిక్ స్థలంలో పేకాడుతున్న 8 మందిని అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ వంటి తెలిపారు. వెదిరేశ్వరంలో రూ.25,070, బండివీధుపుంతలో రూ.2,350 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

పాదగయను దర్శించిన ఎంఎల్‌సి సుబ్బరాజు

ప్రజాశక్తి-పిఠాపురం

దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న ప్రముఖ పుణ్యక్షేత్రం పాదగయను ముమ్మిడివరం ఎంఎల్‌సి ప్రభుత్వ విప్ దత్తు సుబ్బరాజు కుటుంబ సమేతంగా సందర్శించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్, ఇఒ కాట్రు జగన్మోహన్ శ్రీనివాస్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. పదో శక్తి పీఠం పురుహూతికా అమ్మవారిని, కుక్కుటేశ్వర స్వామివారిని, రాజరాజేశ్వరి అమ్మవారిని, దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పండితులు పాద గయ క్షేత్ర విశిష్టతను ఎంఎల్‌సి దంపతులకు వివరించారు. అనంతరం ఇఒ వారికి స్వామివారి శేషవస్త్రములు, చిత్రపటాలు,ప్రసాదములను అందజేశారు. ఆలయ పండితులు వింజమూరి సుబ్రహ్మణ్య శర్మ, అల్లూరి చంద్రమౌళి, దేవస్థానం సూపరింటెండెంట్ బొల్లం వీరభద్రరావు, రెడ్డెం ప్రసాద్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ కొప్పిశెట్టి దత్తాత్రేయ పాల్గొన్నారు.

అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం

ప్రజాశక్తి - జగ్గంపేట

స్థానిక ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద సోమవారం నిర్వహించిన అన్న క్యాంటీన్‌లో పేదలకు అన్నదానం చేశారు. ఈ క్యాంటీన్‌కు జ్యుజ్జవరపు శ్రీనివాస్ చౌదరి సాయం అందించగా టిడిపి నేతలు హాజరై పేదలకు ఆహారం వడ్డించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త కొండబాబు, టిడిపి నాయకులు ఇను మణిబాబు, పాలచర్ల నాగేంద్ర చౌదరి, పాండ్రంగి రాంబాబు, మండపాక అప్పన్న దొర పాల్గొన్నారు.

ప్రయివేటీకరణతోనే అభివృద్ధా..?

-పార్కుల నిర్వహణ ప్రయివేటుకి యత్నం
-ప్రవేశానికి ఛార్జీల వసూలు తప్పదు
-ఆహ్లాదానికి దూరం కానున్న సామాన్యులు

ప్రజాశక్తి - కాకినాడ ప్రతినిధి

జిల్లాలోని ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక, స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో కాకినాడ స్మార్ట్ సిటీలో పార్కుల అభివృద్ధికి కృషి చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. రాష్ట్రంలో ఆదర్శమైన పట్టణంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యల్లో భాగంగా ఇది జరుగుతున్నట్లు ప్రకటిస్తున్నారు. రాజ్‌యోగ రోజుల్లో పార్కులను ప్రముఖ వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు భాగస్వామ్యంతో అభివృద్ధి చేస్తారు. ప్రధానంగా 9 పార్కులను తొలి దశ కింద గుర్తించారు. వివేకానంద పార్క్, బోట్ క్లబ్ పార్క్, అన్నాం మాటి పార్క్, సంత చెరువు పార్క్, జన్మభూమి పార్క్, సురేష్ నగర్ పార్క్, గాంధీనగర్ పార్క్, కెనాల్ బ్రాంచ్ పార్క్, అమరావతి పార్కులను వ్యాపార, పారిశ్రామిక సంస్థలు, స్వచ్ఛంద సంస్థలకు సామాజిక బాధ్యత కింద దత్తతు ఇచ్చేందుకు నగర పాలక సంస్థ సిద్ధంగా ఉంది. అయితే ప్రయివేటీకరణతోనే అభివృద్ధి జరుగుతుందా? అనే ప్రశ్న నగరవాసుల నుంచి వినిపిస్తోంది. ఇప్పటికే నగరం స్మార్ట్ సిటీ నిధులతో పలు రంగాలను అభివృద్ధి చేశారు. ఈ నేపథ్యంలో పార్కుల నిర్వహణ ప్రయివేటు సంస్థలకు అప్పగించే నిర్ణయంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిపిఎం, ప్రజా సంఘాలు, సామాజికవేత్తలు ఈ నిర్ణయాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

నగరంలో సుమారు 5 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఉద్యోగ, ఉపాధి, వ్యాపార అవసరాల నిమిత్తం నగరం, నగరానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎక్కువమంది పేదలు సామాజికంగా అరుకు ఇళ్లల్లో నివసిస్తారు. మధ్యతరగతి వర్గాలు అయితే అపార్టుమెంట్లలో నివసిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే సహజంగానే ఆహ్లాదకరంగా వాతావరణం కనిపిస్తుంది. పట్టణాల్లో అందుకు విరుద్ధంగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆహ్లాదం కోసం పలువురు పార్కులను ఆశ్రయిస్తున్నారు. పట్టణాల్లో నివసిస్తున్న జనాభా వినోదం కోసం సినిమాలకు వెళుతుంటారు. అయితే సినిమా టికెట్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేకపోవడంతో కుటుంబ సభ్యులు, పిల్లాపాపలతో పార్కులకు వెళ్లేందుకు ఇష్టపడుతుంటారు. పార్కుల చుట్టూ అనేకమంది చిరు వ్యాపారులు స్వయం ఉపాధి కోసం వివిధ వ్యాపారాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రయివేటు వ్యక్తులకు పార్కుల నిర్వహణ భారం అప్పగిస్తే ఆటలు, ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేస్తారు. ఆహ్లాదకరమైన పార్కులలో వీటిని ఏర్పాటు చేయడం ఎంతవరకు సమంజసమనే ప్రశ్నలు నగరవాసుల నుంచి వినిపిస్తున్నాయి. ఆటల కోసం క్రీడాస్థలాలను అభివృద్ధి చేయాలి తప్ప ఇలా పార్కుల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేస్తే ఆహ్లాదం అవిరి అవడం ఖాయమనే అభిప్రాయం వినిపిస్తోంది. ఫుడ్ కోసం ఈట్ స్ట్రీట్‌లు ఇప్పటికే ఉన్నాయి. అయితే వీటిని ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రతిపాదనలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పార్కుల్లో ఎగ్జిబిషన్ ప్రాంగణాలు, ఫుడ్ కోర్టులు, నెట్ క్రికెట్, గో-కార్ట్ (ట్రాక్), ఎమ్యూజ్‌మెంట్ రైడ్స్, బంపర్ కార్స్ వంటి వివిధ సౌకర్యాలను ఏర్పాటు చేయడం ద్వారా ఆదాయం వస్తుందని అధికారులు చెబుతున్నారు.

పార్కుల ప్రయివేటీకరణ సరికాదు

కాకినాడ నగరపాలక సంస్థ పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను అధికారులు ఉపసంహరించుకోవాలి. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే వివిధ ఛార్జీలను పెద్ద మొత్తంలో వసూలు చేస్తారు. పబ్లిక్ స్థలాల్లో ప్రజలు సంచరించడానికి ఎటువంటి తారతమ్యాలకు తావుండరాదని భారత రాజ్యాంగం చెబుతోంది. ప్రయివేటు వ్యక్తులకు అప్పగించే నిర్ణయాన్ని ఉపసంహరించుకుని నగరపాలక సంస్థ నిధుల ద్వారా అన్ని పార్కులను అభివృద్ధి చేయాలి.

-పలివెల వీరబాబు, సిపిఎం నగర కన్వీనర్



ఆహ్లాదకరంగా కనిపిస్తున్న కాకినాడ వివేకానంద పార్క్

అభివృద్ధిలో వెనకబడిన పార్కులు


నగరంలో 24 పార్కులు ఉన్నాయి. అయితే అనేక పార్కులు నేటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉన్నాయి. నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ప్రజలు వాటిలో కాలు కూడా మోపని పరిస్థితి ఏర్పడింది. అయితే అధికారులు నగరపాలక సంస్థ స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన పార్కులను మాత్రమే ప్రయివేటు వ్యక్తులకు అప్పగించనున్నారు. అయితే అభివృద్ధిలో వెనుకబడిన పార్కులను ఎందుకు అప్పగించడం లేదనేది పలువురి వాదన. వివేకానంద పార్కు, గాంధీ నగర్, జన్మభూమి, బోట్ క్లబ్ పార్కులను కార్పొరేషన్ నిర్వహిస్తోంది. సెక్యూరిటీ, క్లీనింగ్, పారిశుధ్య పనులను ఇంజనీరింగ్ విభాగం ఆధ్వర్యంలో ఔట్ సోర్సింగ్ కార్మికులు నిర్వహిస్తున్నారు. మిగిలిన పార్కులను స్థానిక అసోసియేషన్లకు తక్కువ మొత్తంలో అంటే నెలకు రూ.6 వేలు ఇస్తూ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. అయితే చాలా పార్కులు పూర్తిస్థాయిలో నిర్వహణ లేక అభివృద్ధి కానరాక వెలవెలబోతున్నాయి. అయితే స్మార్ట్ సిటీ నిధులతో అభివృద్ధి చేసిన వాటిని మాత్రమే ప్రయివేటు సంస్థలకు బాధ్యతలు అప్పగిస్తామనడం ఎంతవరకు సమంజసం అని పలువురు ప్రశ్నిస్తున్నారు. పౌరులు పార్కులలో సంచరించడానికి ఆటంకాలు కల్పించడం రాజ్యాంగ విరుద్ధం అనే వాదనలు మరోవైపు వినిపిస్తున్నాయి. ప్రయివేటు వ్యక్తులకు అప్పగిస్తే పార్కులలో ప్రవేశానికి మొదలుకొని ఇతర అవసరాలకి పెద్ద మొత్తంలో ఛార్జీలు వసూలు చేస్తారు. ఫుడ్ కోర్టులను వెలుపల ఉన్నపుడే ఆహ్లాదకరంగా ఉండాల్సిన పార్కులు వ్యాపారకు నిలయాలుగా మారతాయని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గతంలో కుళాయు చెరువు పార్కులో వ్యవసాయ శాఖ ఫల పుష్ప ప్రదర్శన నిర్వహించేది. నగర ప్రజల కోరిక మేరకు దానిని తొలగించారు. అయితే పాలకవర్గం లేకుండా, ప్రజా ప్రతినిధుల వైఖరి తెలియజేయకుండా పార్కులను ఏ విధంగా ప్రయివేటు వ్యక్తులకు ఇస్తారని సిపిఎం నాయకులు ప్రశ్నిస్తున్నారు. జగన్నాథపురం ప్రాంతంలో సుమారు 1.50 లక్షల మంది జనాభా నివసిస్తున్నారు. ఈ ప్రాంతంలో అన్నమ్మ ఘాటి అభివృద్ధి ఆవకాశంగానే సామాన్యులు నివసించే ఇటువంటి చోట్ల పార్కులను అభివృద్ధి చేస్తే ఉపయోగకరంగా ఉంటుందని పలువురు సామాజిక వేత్తల అభిప్రాయం. అధికారులు పార్కుల ప్రయివేటీకరణ ప్రతిపాదనను పక్కన పెట్టాలనే డిమాండ్ ముందుకొస్తుంది. కావున నగరంలో ఉన్న అన్ని పార్కులను నగరపాలక సంస్థ ద్వారా అభివృద్ధి చేసి ప్రజలకు ఆహ్లాదకరం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని అభిప్రాయం సర్వత్రా వినిపిస్తోంది.

విద్యుత్ శాఖ ముందస్తు ఏర్పాట్లు

ప్రజాశక్తి - ఆలమూరు

తుపాన్ ప్రభావంతో జరిగేనా విపత్తు ఎదుర్తే దానిని ఎదుర్కొనేందుకు విద్యుత్ ముందస్తు ఏర్పాట్లు చేసింది. మండపేట ఏడిఇ శ్రీధర్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాలతో పాటు క్రేన్లను అందుబాటులో ఉంచారు. తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఎక్కడైన విద్యుత్ సమస్యలు ఎదురైతే సమాచారాన్ని చేరవేసేందుకు కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు ఎడిఇ సిహెచ్.శ్రీధర్ తెలిపారు. ఏదైనా సమస్య ఉత్పన్నం అయితే మండపేట టౌన్ 9440904519, ద్వారపూడి సెక్షన్‌లో 9440904527, ఆలమూరు సెక్షన్‌లో 9440904521, రాయవరం సెక్షన్‌లో 9493178873, ఏడిఇ సెక్షన్‌లో 9440904503 నెంబర్లకు తెలియ చేయాలని సూచించారు. తుపాను ప్రభావంతో ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు ఒరిగినా, వైర్లు తెగిపడిన ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అటువంటి పరిస్థితి ఏర్పడితే వెంటనే విద్యుత్ శాఖ అధికారులకు, సిబ్బందికి సమాచారం చేరవేయాలని కోరారు.


క్రేన్‌లతో సిద్ధంగా ఉన్న విద్యుత్ శాఖ సిబ్బంది



దీక్షను కొనసాగిస్తున్న రవికుమార్

కొనసాగిన రవికుమార్ దీక్ష

ప్రజాశక్తి - ముమ్మిడివరం

నిరుపయోగంగా ఉన్న ఆర్‌టిసి బస్‌స్టాండ్‌ను పునరుద్ధరించాలనే డిమాండ్‌తో మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి చిక్కాల రవికుమార్ చేపట్టిన రిలే దీక్ష సోమవారం రెండవ రోజుకు కొనసాగింది. స్థానిక సమైక్యాంధ్ర శిబిరం వద్ద రవికుమార్ చేస్తున్న రిలే దీక్ష సోమవారం 17 రోజుకు చేరుకుంది. ఈ దీక్షకు పాల్గొంటున్నారు చెందిన పోతుల భారతి, హేమ సుందరనారాయణరావు సంఘీభావం తెలిపారు.

తుపానుపై అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కొత్తపేట

తుపాన్ ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నియోజకవర్గ జనసేన ఇన్‌ఛార్జ్ బండారు శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. ప్రజలకు ఎటువంటి సమస్య ఎదురైనా వెంటనే స్థానిక అధికారులకు, కూటమి నాయకులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. తుపానును దృష్టిలో పెట్టుకుని ముంపు భారిన పడిన బాధితులకు జనసేన కార్యకర్తలు అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు. అత్యవసర పరిస్థితుల్లో కొత్తపేట రెవెన్యూ డివిజన్ కంట్రోల్ రూం 08855-244299, 85002-38258 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

భీమేశ్వర ఆలయానికి పోటెత్తిన యాత్రికులు

ప్రజాశక్తి - రామచంద్రపురం

ద్రాక్షారామ భీమేశ్వరాలయానికి సోమవారం యాత్రికులు పోటెత్తారు. వర్షం కురుస్తున్నప్పటికీ ఆలయానికి యాత్రికులు పెద్దఎత్తున చేరుకున్నారు. క్యూ కాంప్లెక్స్‌లన్నీ యాత్రికులతో కిటకిటలాడాయి. శివలింగానికి పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.


ఆలయ కాంప్లెక్స్‌లో యాత్రికులు

యాత్రికునికి అస్వస్థత

ప్రజాశక్తి - ఆలమూరు

స్థానిక జనార్దన స్వామి ఆలయానికి వచ్చిన యాత్రికుడు అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే స్పందించిన ఆలయ అర్చకులు అంగర సాయి భగవాన్ ఆచార్యులు ప్రాథమిక వైద్యాన్ని అందజేశారు. దీంతో యాత్రికుడు కోలుకున్నాడు. తక్షణమే స్పందించి వైద్యాన్ని అందించిన అర్చకుడిని ఆలయ చైర్మన్ బైబెశెట్టి రాంబాబు, గ్రామస్తులు అభినందించారు.

సత్యనారాయణకు అబ్దుల్ కలాం అవార్డు

ప్రజాశక్తి-ఏలేశ్వరం

మండలంలోని యర్రవరం సూర్య విద్యాసంస్థల అధినేత కెవివి.సత్యనారాయణకు డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభా అవార్డు లభించింది. ఈ మేరకు సోమవారం గుంటూరులోని రెవెన్యూ కళ్యాణ మండపంలో మాజీ ఎంఎల్‌సి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో అవార్డును అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సత్యనారాయణ ఏజెన్సీ ముఖ ద్వారమైన యర్రవరంలో తక్కువ ఫీజులకే పేద విద్యార్థులకు విద్యను అందించడమే కాక ఆయన నిర్వహిస్తున్న పలు సేవా కార్యక్రమాలను ప్రాతిపదికగా తీసుకుని ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. లెక్చరర్స్ అండ్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.నాగయ్య సత్యనారాయణను ప్రశంసించారు. ఎస్‌వివి.సత్యనారాయణకు అవార్డు లభించడం పట్ల సంఘం గౌరవాధ్యక్షుడు కెవిఎస్ఎల్.లక్ష్మణరావు, అసోసియేట్ అధ్యక్షుడు కె.గోవిందరావు, ఎస్‌ఎస్‌ఆర్‌ఎం ప్రదీప్, రాజా రత్నకుమార్, కొండపల్లి విల్సన్ బాబు అభినందించారు.

81 మందికి గృహ రుణాల మంజూరు

ప్రజాశక్తి - యానాం

యానాం నియోజకవర్గంలో 1996 తుపాను తర్వాత ఆది ద్రావిడశాఖ ద్వారా ఎస్‌సి గ్రామాల్లో రూ.35 వేలతో నిర్మించిన గృహాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటి స్థానంలో ఒక్కొక్క లబ్ధిదారుడికి రూ.5 లక్షలు గృహ నిర్మాణ స్కీమ్ అమలు చేస్తూ దీపావళి అనంతరం ఆదేశాలు వచ్చాయి. ఆవిధంగా 61 మంది లబ్ధిదారులకు మొదటి దఫా సొమ్ము ఒక్కొక్కరికీ రూ.2 లక్షల 50 వేలు బ్యాంకు ఖాతాల్లో జమ చేసినట్లు ఎంఎల్‌ఎ గొల్లపల్లి శ్రీనివాస్ అశోక్ తెలిపారు.

తుపానుపై అధికారులతో ఆర్ఎఒ సమీక్ష

ప్రజాశక్తి - యానాం

మొంథా తుపాను దూసుకొస్తున్న నేపథ్యంలో ఎన్‌డిఆర్ఎఫ్ రెవెన్యూ, విద్యుత్, ఆరోగ్య, పోలీస్, మున్సిపాలిటీ, వ్యవసాయ, పిడబ్ల్యుడి తదితర శాఖల అధికారులతో ఆర్ఎఒ అంకిత్ కుమార్ సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. గతంలో యానాం ఆర్ఎఒగా పని చేసిన అమన్ శర్మను స్పెషల్ ప్రత్యేక అధికారిగా ప్రభుత్వం నియమించింది. దీంతో సోమవారం అమన్‌శర్మ యానాం చేరుకుని సమావేశంలో పాల్గొన్నారు. పునరావాస కేంద్రాల్లో సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ఎలాంటి సంఘటనలు జరగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలన్నారు.

డిప్యూటీ తహశీల్దారుగా జువ్వల బాలశ్రీ

ప్రజాశక్తి - యానాం

యానాం రెవెన్యూ శాఖ నూతన డిప్యూటీ తహశీల్దార్‌గా జువ్వల బాలశ్రీని నియమిస్తూ పుదుచ్చేరి రెవెన్యూ శాఖ ప్రధాన కార్యదర్శి కులోతుంగన్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన జ్యోతి వెంకటేశ్వరరావును తూనికల కొలతలు శాఖకు బదిలీ చేశారు.

జమీల్‌కు మాజీ సిఎం జగన్ పరామర్శ

ప్రజాశక్తి -రౌతులపూడి

వైసిపి రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి జమీల్ తండ్రి వెంకటేశ్వర్లు జబ్బల వల్ల మృతి చెందడంతో ఆయన కుమారుడు జమీల్‌ను మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డి సోమవారం ఫోన్‌లో పరామర్శించారు. మృతికి గల కారణాలను జమీల్‌ను అడిగి తెలుసుకున్నారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు. వాసిరెడ్డి కుటుంబానికి సానుభూతి తెలిపారు.

భీమేశ్వరాలయంలో ఎంఎల్‌సి పూజలు

ప్రజాశక్తి - సామర్లకోట

సామర్లకోట కుమార రామ భీమేశ్వరాలయంలో సోమవారం పెద్దాపురం ఎంఎల్‌సి నిమ్మకాయల చినరాజప్ప కుటుంబంతోత కలిసి ప్రత్యేక పూజలు చేపట్టారు. కార్తీకమాసం తొలి సోమవారం సందర్భంగా ప్రత్యేక పూజలు చేపట్టారు. ఎంఎల్‌సికు చినరాజప్పకు ఆలయ ఇఒ బళ్ల నీలకంఠం, ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్ ఆధ్వర్యంలో ఆలయ పండితులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఎంపిని నిలదీసిన మత్స్యకారులు

ప్రజాశక్తి -యు.కొత్తపల్లి

సముద్రపు ఒడ్డున నివసిస్తున్న మత్స్యకారులకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తే తుపానుల ముప్పు తప్పుతుంది కదా అని మత్స్యకారులు కాకినాడ ఎంపీ తంగేళ్ల ఉదయ శ్రీనివాస్‌ను నిలదీశారు. సోమవారం ఉప్పాడ తీర ప్రాంతాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఎంపీకి చేదు అనుభవం ఎదురయ్యింది. మత్స్యకారులను పునరావాస కేంద్రాలకు తరలి వెళ్లాలని ఎంపి సూచిస్తున్న తరుణంలో కొంతమంది మత్స్యకారులు ఎంపీ ఉదయ శ్రీనివాస్‌ను నిలదీశారు. కొన్ని సంవత్సరాలుగా ఉప్పాడ అలల తాకిడికి గృహాలు సముద్ర గర్భంలో కలిసిపోతున్నాయని, తుపానుల సమయంలో మాత్రం అధికారులు, నాయకులు హడావిడి చేసి వెళ్లిపోతున్నారు తప్ప మత్స్యకారులను పట్టించుకోవడం లేదన్నారు. తమ స్థలాలు కేటాయించి ఇళ్లు నిర్మిస్తే తుపానుల ముప్పు తప్పుతుంది కదా అని ప్రశ్నించారు. పునరావాస కేంద్రాలకు వెళ్లిన లేదని, తమకు తుపానులు అలవాటే అని ఎంపికి తెలిపారు.

భవన కార్మికుల సభ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-పిఠాపురం

భవన నిర్మాణ కార్మికుల జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని భవన కార్మికుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నిట్ల శ్రీను, రొంగల ఈశ్వరరావు పిలుపు ఇచ్చారు. స్థానిక బిల్డింగ్ వర్కర్స్ కార్యాలయం వద్ద సోమవారం మండల కమిటీ సమావేశంలో సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడారు. 2వ మహాసభలు జగ్గంపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అక్టోబర్ 31న జగ్గంపేట సెంటర్లో భవన కార్మికులు సమస్యలపై సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహిస్తామని, నవంబర్ 1న జగ్గంపేటలో గోకవరం రోడ్డులోని కాపు కళ్యాణ్ మండపంలో ప్రతినిధుల సభ నిర్వహిస్తామని తెలిపారు. ఈ మహాసభలకు రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరవుతారన్నారు. ఈ మహాసభలో భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరణ, జిల్లాలో భవన నిర్మాణ కార్మికుల సమస్యలపై చర్చించి వాటి పరిష్కారం కోసం ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. మండల అధ్యక్షుడు శిరం సత్తిబాబు, పి.శ్రీను, పి.దేవుళ్ళు, అమరాది దొరబాబు, బూదిన సత్తిబాబు పాల్గొన్నారు.

కాలినడకన వచ్చే వారికి ప్రాధాన్యం

ప్రజాశక్తి - ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామి ఆలయానికి సుదూర ప్రాంతాల నుంచి కాలినడకన వచ్చే భక్తులకు దర్శనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఆలయ చైర్మన్ ముదునూరి వెంకటరాజు, ఆలయ డిసి నల్లం సూర్యచక్రధరరావు అన్నారు. సోమవారం పశ్చిమ గోదావరి జిల్లా నవుడూరు, నెలమూరు గ్రామాల నుంచి 250 మంది యాత్రికులు ఆదివారం ఉదయం పాదయాత్రగా బయలుదేరి సోమవారం మధ్యాహ్నానికి వాడపల్లి వెంకన్న ఆలయానికి చేరుకున్నారు. అనంతరం స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వీరికి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.